క్లుప్తంగా

వీధి కుక్కల పట్టివేత



పట్టణంలో వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు, లక్ష్మీనగర్ కాలనీ, అగర్‌బత్తీ కాలనీల్లో స్థానిక మున్సిపల్ అధికారులు తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ సౌజన్యంతో 671 వీధి కుక్కలను సోమవారం పట్టుకున్నారు. వీటికి వాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించి ఆపై వదలిపెట్టనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కొన్నాళ్లుగా పట్టణంలో కుక్కకాట్ల వలన పలువురు గాయపడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

శిక్షణార్థులకు విశ్వకర్మ యోజన సర్టిఫికెట్లు



కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకుంటున్న పలమనేరు వాసులు

పలమనేరు: పీఎం విశ్వకర్మ యోజన ద్వారా వృత్తికళలపై శిక్షణ పొందిన వారికి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సర్టిఫికెట్లను కలెక్టర్ షన్మోహన్ పంపిణీ చేసినట్టు పలమనేరుకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. ఈ పథకం కింద టూల్‌కిట్ల కోసం రూ.15వేలు, రోజు భృతిగా రూ.500తో పాటు అధికారులు బ్యాంకు రుణంగా రూ.లక్ష మంజూరు చేస్తున్నట్టు లబ్ధిదారుడు డేరంగుల సుబ్రమణ్యం పేర్కొన్నారు.

వైభవంగా వృక్ష కల్యాణం



తులసి, ఉసిరి చెట్ల కల్యాణోత్సవం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన శ్రీ కోదండరాములు దేవస్థానంలో సోమవారం కార్తీక మాసం పురస్కరించుకొని వృక్ష కల్యాణం నిర్వహించారు. తులసి, ఉసిరి చెట్లకు సంప్రదాయబద్ధంగా చతుర్దశ వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదారులు కల్యాణోత్సవానికి పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, పూలదండలు, పండ్లు వివాహానికి అవసరమైన సరకులు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు వేద మంత్రాలు పఠనం చేస్తూ తులసి, చెట్టుకు కల్యాణం నిర్వహించారు.

గోమాతకు పూజలు చేసిన భక్తులు

కోదండరామాలయంలో సోమవారం ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద గ్రామ ప్రజలు భక్తి ప్రపత్తులతో గోమాతకు పూజలు చేసి, అరటి పండ్లు, గడ్డి తినిపించి మొక్కులు చెల్లించుకున్నారు. సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేసి మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. వేదపండితులచే భగవద్గీత పారాయణం చేయించారు.

నేడు సుదర్శన హోమం

కోదండరామాలయంలో మంగళవారం ఉదయం యాగశాల ప్రవేశం, విష్వక్సేనారాధాన,అఖండదీపారాధన, చతుస్థానార్చన, మహాసుదర్శన పూజ, అగ్నిప్రతిష్ట, మహాసుదర్శన హోమం, హనుమంతులారాధన, శ్రీరామనామాన్ని రాసిన తమలపాకులతో అర్చన, హనుమాన్ మూలమంత్ర హోమాలు, మన్యసూక్త హోమం, మహాపూర్ణాహుతి, మహానైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని ఆలయవంశపారంపర్య ధర్మకర్త పి. సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

బొప్పాయి రైతులు విలవిల

- 'రింగ్ స్పాట్' వైరస్ దెబ్బకు 100 ఎకరాల్లో పంట నష్టం
- రూ.కోటి నష్టపోయిన కుప్పం రైతాంగం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వినతి



వైరస్ సోకి ఆకులు, కాయలు రాలిన బొప్పాయి తోట

కుప్పం రూరల్: కుప్పం నియోజక వర్గంలోని బొప్పాయి రైతులను 'రింగ్ స్పాట్' వైరస్ నిలువునా ముంచింది. 8 నెలల పాటు కష్టపడి సాగు చేసిన పంట చేతికందే సమయంలో వైరస్ ఆశించడంతో 100 ఎకరాల్లో పంట నాశనమైంది. ఎకరాకు సగటున రూ.లక్ష వరకు ఆదాయం కోల్పోయారు. మొత్తంగా చూస్తే వంద ఎకరాల్లో రూ.కోటి నష్టపోయినట్లు బాధితులు చెప్పారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

వైరస్ దెబ్బకు విలవిల

మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన కుప్పంలో ఎప్పుడూ రకరకాల పంటల సాగు చేయడం ఇక్కడ ఆనవాయితీ. రైతులు ఈ పర్యాయం బొప్పాయి 100 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరా సాగుకు లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. సాధారణంగా బొప్పాయిని ప్రతి ఏటా జనవరి నెలలో నాటుతారు. ఆగస్టు నుంచి దిగుబడి వస్తుంది. పది రోజులకోసారి వచ్చే కోతతో ఒకటి రెండు కోతలు కోశారు. ఆ తరువాత 'రింగ్ స్పాట్' వైరస్ మహమ్మారి రైతులను ముంచింది. కాయలు తరుణానికి రాకముందే వైరస్ సోకింది. దీంతో పంట నష్టపోయారు. పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని, ఇక తమకు కుటుంబ పోషణకు కూలీ పనులే శరణ్యమని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

రింగ్ స్పాట్ వైరస్ లక్షణాలు

వాతావరణ మార్పుల వల్ల వచ్చే ఆ వైరస్ చెట్లకు సోకితే కాయలు కాసే సమయంలో చెట్టు కుళ్లిపోతుంది. పచ్చికాయలు లోపల వైరస్ చేరి ఒకటి రెండు రోజుల్లోనే ఎర్రటి రంగులో మారి కుళ్లిపోతుంది. చెట్టు కాండంలో సైతం రంధ్రాలు పడి ఆకులు, కాయలు రాలిపోతాయి. దీంతో రైతులు ముందుగానే చెట్లను తొలగిస్తున్నారు.



కుళ్లి నేల రాలిన బొప్పాయి

తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు


బొప్పాయిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పలమనేరు ఉద్యానవనశాఖ ఏడీ కోటీశ్వరరావు తెలియజేశారు.

- ఇన్‌షీట్ ప్రూఫ్ నెట్‌లలో పెంచుకోవాలి
- గుమ్మడి జాతి మొక్కలను బొప్పాయి తోట సమీపంలో పెంచరాదు
- బొప్పాయి తోట చుట్టూ జొన్న, మొక్కజొన్న పంటలను పెంచుకోవాలి
- రసం పీల్చు పురుగుల నివారణకు డైపోథోయేట్-2 మి.లీ., వేపనూను 3 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఎసిఫేట్-2 గ్రాములు, ఇమిడాక్లోప్రైడ్ 3 మి.లీ., 3 మి.లీ. వేపనూనె ఒక లీటరు నీటిలో కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి.
- దీనికి తోడు పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలి

రూ.6 లక్షలు నష్టపోయా!

నేను 6 ఎకరాల పొలంలో బొప్పాయి సాగు చేశా. మొక్కల కొనడం, దుక్కులు, కూలీ కలుపుకుని ఎకరాకు లక్ష వరకు ఖర్చైంది. 2024 జనవరిలో మొక్కలను నాటాను. ఆగస్టుకు కోత రావాల్సి వచ్చింది. ఆగస్టు మధ్యలో కోత వచ్చింది. రెండు కోతలు కోశాను. రూ.40 వేల వరకు ఆదాయం వచ్చింది. తరువాత వైరస్ సోకడంతో చెట్లలోని కాయలు పిందె దశలోనే కుళ్లిపోయి నేలరాలడం ప్రారంభమైంది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకపోయింది. రూ.6 లక్షల వరకు నష్టం వచ్చింది. 8 నెలలు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట వైరస్ దెబ్బకు నష్టపోవాల్సి వచ్చింది. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదప్పా.

–కుమారస్వామి, బొప్పాయి రైతు, కొత్తయిండ్లు



పిందె దశలోనే కాయలు కుళ్లిపోయిన దృశ్యం

బొప్పాయితో ఖేదం.. అలసందతో మోదం



బొప్పాయిలో అంతర పంటగా అలసంద

పలమనేరు: బొప్పాయి సాగుచేసిన రైతులు కాయలను తోటల్లోనే వదిలేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కొనేవాళ్లు లేక కొందరు తోటలను రోటవేటర్‌తో తొక్కించేస్తున్నారు. తోటల్లో మాగిన కాయలు పక్షుల పాలవుతున్నాయి. బొప్పాయి సాగులో ఇలాంటి పరిస్థితి తలెత్తితే నష్టాల బారిన పడకుండా గట్టెక్కేందుకు ఓ రైతు అంతర పంటగా అలసందను సాగుచేసి బొప్పాయిలో వచ్చిన నష్టాలను పూడ్చుకున్నాడు. వివరాలు..పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె మండలం చీలంపల్లెకు చెందిన రైతు రఘువప్ప తన ఎకరా పొలంలో మూడునెలల క్రితం బొప్పాయి సాగుచేశాడు. ఇప్పుడు తోట కోత దశలో ఉంది. అయితే ధరలు లేక కాయలను తోటలోనే వదిలేశాడు. కానీ ఇదే తోటలో అంతర పంటగా వేసిన అలసంద ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో రూ.80 వరకూ ఉండడంతో రైతుకు బొప్పాయిలో కలిగిన నష్టం అలసంద పూడ్చింది. దీన్ని చూసిన పలువురు రైతులు.. తెలివిగా అలసంద వేసి గట్టెక్కినావప్పా అని అభినందించారు.

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె గ్రామ సచివాలయాన్ని సోమవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైతే జెడ్పీ నిధుల నుంచి గ్రాంటు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై హింసను వ్యతిరేకిద్దాం

పలమనేరు: మహిళలపై జరిగే హింసను ప్రస్తుత సమాజం వ్యతిరేకించాలని, హింసలేని సమాజం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఐద్వా సంఘ అధ్యక్షురాలు భువనేశ్వరి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'హింస రహిత సమాజం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, సమాజంలో స్మార్ట్‌ఫోన్లు, గంజాయికి బానిసలు, మద్యపానం.. ఇత్యాది వ్యసనాలకు అలవాటు పడిన వారు మహిళలపై ఎక్కువగా అత్యాచారాలు, అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులపై విద్యార్థి దశ నుంచే బాలికలు దృఢంగా ఉండాలన్నారు. స్థానిక న్యాయవాది భర్కర్ మాట్లాడుతూ, బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. వివిధ చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎల్ఐసీ నాయకులు కుమారస్వామి రెడ్డి, మహిళా పోలీస్ ఉష తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలి

సదుం/పెద్దపంజాణి: రబీ సీజన్‌లో వేరుశనగ, వరి సాగు చేసే రైతులు పసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సదుం, పెద్దపంజాణి మండలాల వ్యవయాధికారులు హరిప్రసాద్, రఖీబా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పంట రుణాలు తీసుకోని రైతులు వరి పంటకు ఎకరాకు రూ.84 ప్రీమియం చెల్లిస్తే బీమా రూ.42 వేలు, అలాగే వేరుశనగకు ఎకరాకు రూ.60 ప్రీమియం చెల్లిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుందని చెప్పారు. వరికి డిసెంబర్ నెలాఖరులోపు 31, వేరుశనగకు 15లోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు నష్టపోయిన పక్షంలో రైతులకు బీమా సాయం అందుతుందని తెలియజేశారు. వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

టమాట పంటకు బీమా..

పుంగనూరు: రబీ సీజన్‌లో సాగు చేసిన టమాట పంటకు బీమా చేసుకోవాలని హెచ్‌వో వరప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం కిందరూ.500 రైతులు చెల్లిస్తే ఎకరాకు రూ.25 వేలు బీమా వర్తిసుందని, రైతులు తమ భూమి రికార్డులతో డిసెంబర్ 15లోపు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఏవైనా అనుమానాలు ఉంటే సంబంధిత ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

బైరెడ్డిపల్లె ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: పది రోజులుగా చిత్తూరులో 35 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు నిర్వహిస్తున్న వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా నిర్వహించిన క్రీడల పోటీల్లో బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాల క్యాడెట్లు సత్తా చాటారు. వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం నసీబ్‌జాన్ సోమవారం తెలిపారు. చిత్తూరు శిబిరంలో పుంగనూరు, వాల్మీకిపురం, కడపనత్తం, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె స్కూళ్ల క్యాడెట్లు మ్యాప్ రీడింగ్, డ్రిల్, ఇతర అంశాల్లో శిక్షణ పొందారు. అలాగే వాలీబాల్ పోటీల్లో బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాల క్యాడెట్ల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఉస్మాన్, ఈశ్వర్, మైత్రేస్, అయాజ్, సందీప్, మైయూన్ ప్రతిభ చూపి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం చెప్పారు. ఈ పోటీలో మొత్తం ఐదు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో బైరెడ్డిపల్లె జట్టు విజయకేతనం ఎగురవేసింది. క్యాడెట్లను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

న్యాయం చేయండి సారూ..!



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: తమ సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయండి సారూ అంటూ పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జేసీ విద్యాధరికి అర్జీలు అందజేసి న్యాయం చేయాలని కోరారు.

భూమి ఆక్రమించుకున్నారు



తన భూమిని ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని పులిచెర్ల మండలం రాయవారిపల్లెకు చెందిన సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రాయవారిపల్లెలో సర్వే నెంబర్ 151/11లో 2.75 ఎకరాల భూమి ఉందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం సైతం తనపేరు మీద ఉందని చెప్పారు. ఆ భూమిలో పంటలు పండించుకుని జీవనం కొనసాగిస్తుండగా మరొక వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తనకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

వితంతు పింఛన్ మంజూరు చేయండి



తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని పెద్దపంజాణి మండలానికి చెందిన పద్మావతి విజ్ఞప్తి చేసింది. చాలా నెలలుగా వితంతు పింఛన్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త మృతి చెందడంతో ఎలాంటి జీవనాధారం లేదని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: అధికారుల దృష్టికి వచ్చిన ఎస్సీ, ఎస్టీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ యువరాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో తహసీల్దార్ పార్వతి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరై ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు, రాయితీలను వివరించారు. మండలంలో పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేవని, కేటాయించిన స్థలాలు ఆక్రమణలు గురవుతున్నాయని, అలాగే కాలనీల్లో సరైన రోడ్లు, నీటి సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కమిటీ సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం ఎంపీపీ పైవిధంగా స్పందించారు. ఆక్రమణకు గురైన స్థలాల్లో సర్వే చేయించి వారికి న్యాయం చేయాలన్నారు. దీనికి అవసరమైన నిధులు మంజూరు చేయించి వచ్చే సమావేశంలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్ రెడ్డి, మండల అధికారులు, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం



నల్లగుట్లపల్లెతాండ వద్ద సారాఊట ధ్వంసం చేస్తున్న సీఐలు

- మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పుంగనూరు: గ్రామాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని నల్లగుట్లపల్లెతాండాలో సారా ఊటను, బట్టీలను ధ్వంసం చేశామన్నారు. అలాగే పెద్దపంజాణి మండలం పెద్దారికుంట వద్ద అక్రమంగా 769 ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తున్న ప్రేమ్‌నాథ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జవహర్ బాబు, పలమనేరు ఇన్‌స్పెక్టర్ సతీష్, స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, తంబేష్, దశరథ, జెఆర్. నాగరాజు, ఎం.నరేంద్రరెడ్డి, సురేంద్ర, బాబువినోద్ పాల్గొన్నారు.

పరమ పవిత్రం కార్తీక మాసం





వి.కోటలో.., సదుం: ప్రత్యేకాలంకారంలో అరుణాచలేశ్వరస్వామి

వి.కోట: కార్తీక మాసం చివరి సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఈశ్వర్‌నగర్‌లోని శ్రీ కాశీవిశ్వేరస్వామి, దాసార్లపల్లెలోని కాశీవిశ్వేరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంరించారు. మహిళలు పిండిదీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు.

బైరెడ్డిపల్లె: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో కార్తీక పూజలు చేశారు. మహిళలు ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. శ్రీవాసవీ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రామక్రిష్ణమాచార్యులు ఆలయం వద్ద ధాత్రీ హోమం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుడుపల్లె: కార్తీక మాసంలోని చివరి సోమవారం సందర్భంగా శివాలయాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గుడివంక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, గంగాధరేశ్వరస్వామి, మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వరస్వామి, కాడేపల్లెలోని నాగదేశ్వరస్వామి ఆలయాలలో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు. అలాగే గ్రామాలలో ఉపవాసాలతో ఇళ్లలో శివ పార్వతుల చిత్రపటాలను పూజలు చేశారు.



గుడుపల్లె: గుడివంకలో వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

కుప్పం: సోమేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రమిదలలో దీపాలు వెలిగించి శివనామస్మరణ చేశారు. ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లోని శివాలయంలోనూ భక్తిప్రపత్తులతో పూజలు చేశారు.

సదుం: మండలంలోని శైవ క్షేత్రాలలో భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక అరుణాచలేశ్వర స్వామి, మరకతేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయాలు, అలాగే మత్తుకువారిపల్లె మల్లేశ్వరస్వామి, జంగంపల్లె కాశీవిశ్వేరస్వామి ఆలయాలలో పూజలు, అభిషేకాలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. పలువురు కేదారేశ్వరస్వామి వ్రతమాచరించారు.



బైరెడ్డిపల్లె: శ్రీవాసవీమాత ఆలయం వద్ద ధాత్రీ హోమంలో పాల్గొన్న మహిళలు

భౌబోయ్

- పెరిగిన కుక్కల సంచారం
- మనుషులపై విరుచుకుపడుతున్న కుక్కల గుంపు
- కట్టడి చేయాలంటున్న ప్రజలు



చౌడేపల్లెలో కుక్కల గుంపు

చౌడేపల్లె: మండల కేంద్రం సహా పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారు బెంబేలెత్తిపోతున్నారు. కాస్త ఆదమరిస్తే ప్రజలపై తిరగబడి వీధి కుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయి. బస్టాండు సమీపంలోని చికెన్ షాపుల వద్ద వ్యర్థాల కోసం అధిక సంఖ్యలో కుక్కలు నడిరోడ్డుపై సంచరించడం, వ్యర్థపదార్థాలను తిని అటువైపుగా వెళ్తున్న ప్రజలపై నిత్యం దాడులు చేయడం సర్వ సాధారణమైపోతోంది. ద్విచక్రవాహనదారులకు అడ్డంగా దూరడంతో వాహనాలు అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటనలు జరిగాయి. బోయకొండలో ఇటీవల కర్ణాటకు చెందిన భక్తులపై కుక్కలు దాడిచేశాయి. అలాగే చౌడేపల్లె, దిగువపల్లె, కాటిపేరి, ఏ.కొత్తకోట, కాగతి ప్రాంతాల నుంచి కుక్క కాటు బారినపడిన వారు ఉన్నారు. ప్రతినెలా 15నుంచి 25 కేసులు నమోదు అవుతున్నాయని ఇప్పటివరకు 319 కేసులు నమోదయ్యాయని వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఇలా నిత్యం ఏదో ఒక గ్రామంలో కుక్కల దాడిలో చిన్నారుల నుంచి పెద్దలే కాకుండా పశువులు సైతం గాయపడిన సంఘటనలు జరిగాయి.

అధికారులు స్పందించాలి

కుక్కల స్వైర విహారం నియంత్రించడానికి పంచాయతీశాఖ అధికారులు, పాలకులు స్పందించాలి. నిత్యం కుక్కల దాడిలో ప్రజలు గాయాల పాలవుతున్నారు. కుక్కలదాడిలో ప్రజలే కాదు జంతువులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇళ్ల వద్ద పెంచుకునే కోళ్లను, గొర్రెలు, మేకలపై దాడిచేస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

–రమణారెడ్డి, పెద్దకొండామర్రి

కరిచిన వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి

కుక్క కరిచిన వెంటనే కాటు పడిన ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. ప్రభుత్వాస్పత్రిలో ఏఆర్‌వీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్)ను ఐదురోజులపాటు వేయించుకోవాలి. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ చికిత్స తీసుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో కుక్క కాటుకు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి.

–పవన్‌కుమార్, వైద్యాధికారి, చౌడేపల్లె